# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 01-01-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **నూతన ఆంగ్ల సంవత్సరం 2026కు స్వాగతం పలుకుతూ ప్రజలు ఆనందోత్సాహాలతో వేడుకలు జరుపుకుంటున్నారు.**

2. **2026 నూతన సంవత్సరం మరింత సంపన్నమైన దేశాన్ని నిర్మించడానికి కొత్త శక్తిని అదించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు.**

3. **మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతను ఇస్తోందని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ తెలిపారు.**

4. **పర్యాటకులకు భూతల స్వర్గధామంగా ఉండేలా ములుగు జిల్లాను తీర్చిదిద్దుతున్నట్లు తెలంగాణ మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క అన్నారు.**

===========================

నూతన ఆంగ్ల సంవత్సరం 2026కు యావత్ ప్రపంచ ప్రజలు ఆహ్వానం పలుకుతూ వేడుకలు జరుపుకుంటున్నారు. కాల గర్భంలో కలిసిపోయిన 2025 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ .... ఆ సంవత్సరంలో తీపి ..., చేదు జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ .... కొత్త ఆశలు ....,.కొంగొత్త ఆకాంక్షలతో నూతన సంవత్సరాన్ని స్వాగతిస్తున్నారు. ఒకరికొకరు పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటూ మిఠాయిలు పంచుకున్నారు. న్యూజిలాండ్ దేశంలోని ఆక్లాండ్ నగరంలో మొదటగా నూతన సంవత్సర వేడుకలు ప్రారంభ మయ్యాయి.

ఉభయ తెలుగు రాష్ట్రాలలో నూతన సంవత్సర వేడుకలను ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. కొత్త సంవత్సరం శుభాలు కలుగ జేయాలని ఆకాంక్షిస్తూ రెండు రాష్ట్రాలలోని అన్ని ప్రధాన ఆలయాలలో ప్రత్యేక పూజలు చేస్తున్నారు. మరొక వైపు .... కొత్త సంవత్సర వేడుకల నేపథ్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాలలోని పోలీసు శాఖలు ముందు జాగ్రత్త చర్యగా పలు ఆంక్షలు విధించాయి.

---------------------------

2026 నూతన సంవత్సరం మరింత సంపన్నమైన దేశాన్ని నిర్మించడానికి కొత్త శక్తిని అదించాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. “వికసిత్ భారత్”ను లక్ష్య సాధనకు అంకిత భావంతో పని చేయాలన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సరం ఉజ్వల భవిష్యత్తుతో పాటు కొత్త అవకాశాలను, కొత్త లక్ష్యాల సాధనకు ప్రేరణ ఇస్తుందని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. నూతన సంవత్సరం ప్రారంభం సందర్భంగా ఆయన ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. '2026 నూతన సంవత్సరం మనందరికీ ఉల్లాసం, ఆనందం, శాంతి, శ్రేయస్సు కలగజేయాలి' అని ఆకాంక్షించారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. గడిచిన 2025 సంవత్సరంలో కూటమి ప్రభుత్వ పాలన మరిచిపోలేని విజయాలను అందించిందని, ఎన్నో మైలు రాళ్లను చేరుకుందని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో 2026 నూతన సంవత్సరం అందరి జీవితాలలో కొత్త కాంతులు నింపాలని మనసారా కోరుకుంటున్నట్లు తెలిపారు.

కూటమి ప్రభుత్వం 2026 కొత్త సంవత్సరంలో ప్రజలకు మరింత మెరుగైన పాలన అందించనుందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

-------------------------

తెలంగాణ రాష్ట్ర ప్రజలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. "2026 సంవత్సరం.. అందరి ఆకాంక్షలను నెరవేర్చి, శాశ్వత ఆనందాన్ని తీసుకురావాలని, సమ్మిళిత, స్థిరమైన దేశాభివృద్ధి సాధించే లక్ష్యంగా ప్రతి పౌరుడు అంకితభావంతో పనిచేయాలని పేర్కొన్నారు.

విజన్ 2047 లక్ష్య సాధన దిశగా ఈ ఏడాదిలో తెలంగాణ ప్రభుత్వం మరింత ముందుకు సాగుతుందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఆయన ప్రజలకు 2026 నూతన సంవత్సరం శుభకాంక్షలు తెలిపారు. రైతులతోపాటు మహిళలు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలను నెర వేర్చేందుకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని పేర్కొన్నారు.

-------------------------

రాష్ట్రవ్యాప్తంగా పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రభుత్వ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, గ్రామస్థాయి ఉద్యోగులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలియజేశారు. నూతన సంవత్సరం సందర్భంగా పేదల ఇళ్లల్లో సంతోషం నింపేందుకు ఒక రోజు ముందుగానే పింఛన్లు ఇవ్వాలనే ప్రభుత్వ ఆలోచనను వీరంతా ఆచరణాత్మకం చేశారన్నారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేద ప్రజలకు ఆర్థిక భరోసా ఇవ్వాలనేదే ప్రభుత్వ సంకల్పమన్నారు. పింఛన్లు అందుకున్న లబ్దిదారులు అందరికీ 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలను ముఖ్యమంత్రి తెలియజేశారు.

-------------------------

మహిళా సాధికారతకు కేంద్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని, పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో పిఎం ఉజ్వల యోజన పథకంలో భాగంగా లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ కనెక్షన్ల ను ఆయన నిన్న పంపిణీ చేసారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళల అభ్యున్నతికి, వారి ఆరోగ్య రక్షణకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. మహిళల ఆరోగ్యాన్ని దృష్టిలో

ఉంచుకుని, కాలుష్య రహిత విధానాల ద్వారా వంట చేయడం కోసం ఉచిత గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేస్తున్నారని పేర్కొంటూ..

వాయిస్...30 సెకన్లు

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ హయాంలో దేశ రక్షణ, సైనిక సంకల్పాన్ని పునర్నిర్వచించిన సంవత్సరంగా 2025 చరిత్రలో నిలిచిపోనుంది. 'సంస్కరణల సంవత్సరం'గా నిలిచిన ఈ ఏడాది కాలంలో రక్షణ రంగంలో దేశం సాధించిన పురోగతి గురించి ఆకాశవాణి అందిస్తున్న ప్రత్యేక కథనం..

దేశ రక్షణకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్న కేంద్ర ప్రభుత్వం, పౌరులపై జరిగే దాడులను దేశం వేగవంతమైన, ఖచ్చితమైన, నిర్ణయాత్మక చర్యతో ఎదుర్కొంటుందని నిరూపించింది. గత ఏడాది మే 7వ తేదీన చరిత్రలో అత్యంత ముఖ్యమైన సైనిక చర్యలలో ఒకటైన ఆపరేషన్ సిందూర్‌ను రక్షణ దళాలు విజయవంతంగా నిర్వహించాయి. ఇది గత ఐదు దశాబ్దాలలో పాకిస్తాన్‌తో చేపట్టిన దేశం యొక్క అత్యంత ముఖ్యమైన సైనిక చర్యగా నిలిచింది. ప్రధాని మోదీ నేతృత్వంలో దేశ రక్షణ రంగ పరివర్తన గత ఏడాది కొత్త శిఖరాన్ని అదిరోహించింది. మేక్ ఇన్ ఇండియా ద్వారా నడిచే రక్షణ ఉత్పత్తుల సామర్థ్యం 2014లో 40 వేల కోట్ల రూపాయలు ఉండగా, నేడు లక్షా 54 వేల కోట్ల రూపాయలకు పెరిగింది. రక్షణ రంగ బడ్జెట్ 2013-14లో 2 లక్షల 53 వేల కోట్ల రూపాయల నుంచి, 2025-26లో 6 లక్షల 81 వేల కోట్లకు పెరిగింది. గత ఏడాదిలో 4లక్షల 30 వేల కోట్ల రూపాయల విలువైన రక్షణ రంగ యంత్రపరికరాల సేకరణ ప్రతిపాదనలు ప్రభుత్వంచే ఆమోదించబడ్డాయి.

---------------------------

పర్యాటకులకు భూతల స్వర్గధామంగా ములుగు జిల్లాను తీర్చిదిద్దుతున్నట్లు తెలంగాణ మహిళా, శిశు సంక్షేమశాఖ మంత్రి దనసరి సీతక్క తెలిపారు. పర్యాటకుల కోసం.. ఇప్పటికే ఎన్నో పర్యాటక కేంద్రాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. త్వరలోనే మరికొన్నింటిని ప్రారంభిస్తామని చెప్పారు. ములుగు జిల్లా ఏటూరునాగారం అభయారణ్యంలో రెండు సఫారీ వాహనాల్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్..25 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో ఉత్తర, ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. వీటి ఫలితంగా రాష్ట్రంలోని ఉత్తర కోస్తా, యానాంలలో ఈ రోజు పొడి వాతావరణం ఏర్పడే అవకాశము ఉందని సంబంధిత అధికారి ఎం. వెంకట్రావు పేర్కొంటూ..

వాయిస్.... 20 సెకన్లు

మరోవైపు ఉభయ తెలుగు రాష్ట్రాల్లో చలి తీవ్రత కొనసాగుతోంది. ఏజన్సీ, ఇతర ప్రాంతాల్లో దట్టమైన పొగమంచు కురుస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు 5 నుంచి 15 డిగ్రీల సెల్సియస్‌లోపు నమోదవుతున్నాయి.

తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు పొడి వాతావరణం నెలకొంటుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అక్కడక్కడా కనిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీల సెల్సియస్ వరకూ తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, కొమరంభీమ్, ఆసిఫాబాద్, మంచిర్యాల, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడా శీతల గాలులు వీచే అవకాశం ఉందని హెచ్చరించింది.

======================